నిరుద్యోగ భృతి ఏదీ?

- సూపర్ సిక్స్‌లో కీలక హామీపై నిరుద్యోగ యువత ఎదురుచూపు
- ఉద్యోగాల కల్పన నోటిఫికేషన్‌పై గంపెడాశలు

కంకిపాడు/గన్నవరం: కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో ముఖ్యమైన ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి హామీని ప్రభుత్వం ఎప్పటి నుంచి అమలులోకి తెస్తుందోనన్న ఆశలో యువత ఉన్నారు. ఉద్యోగాల కల్పన జరిగే వరకూ కనీసం నిరుద్యోగ భృతి అందించి యువతకు చేయూతగా నిలుస్తుందనే భరోసాతో ఎదురుచూస్తున్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలతో పాటుగా ఉయ్యూరు మున్సిపాలిటీ, వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ ప్రాంతాలు ఉన్నాయి. వీటిలో 98,489 గృహాలు ఉన్నాయి. అనధికారికంగా మరో 10 వేల గృహాలు ఉన్నాయి. గన్నవరం నియోజకవర్గంలో గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 97,837కు పైగా కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు ఇంటికో ఉద్యోగం కల్పిస్తే నియోజకవర్గంలో సుమారు లక్ష మంది వరకు లబ్ధి చేకూరనుంది. లేని పక్షంలో నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.30 కోట్ల వరకు ఆర్థిక లబ్ధి పొందనున్నారు.



పెనమలూరు నియోజకవర్గంలో గృహాల సంఖ్య

వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ	: 34,000
పెనమలూరు	: 13,500
కంకిపాడు	: 18719
ఉయ్యూరు	: 10,200
ఉయ్యూరు మున్సిపాలిటీ	: 12,070
అనధికారికంగా మరో 10 వేలు నివాసాలు	

గన్నవరం నియోజకవర్గంలో గృహాల సంఖ్య

గన్నవరం	: 24,734
బాపులపాడు	: 23,290
ఉంగుటూరు	: 15,253
విజయవాడ రూరల్	: 34,560

ఆశతో నిరుద్యోగులు

అష్టకష్టాలు పడి విద్యనభ్యసించిన యువత సరైన అవకాశాలు లేక ఉపాధి కరువై జీవిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పక్షాలు కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్ ప్రకటించాయి. ఇందులో ప్రధానంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అని ప్రకటించాయి. ఎన్నికల ప్రచార సమయంలో ఉయ్యూరు ప్రధాన సెంటరులో ఈ ఏడాది ఏప్రిల్ 7న జరిగిన బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ హామీలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఇందులో ప్రధానంగా యువతకు ఉద్యోగాల కల్పన, ఉద్యోగం లభించే వరకూ నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి కల్పించేందుకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఆ హామీని నమ్మిన యువత కూటమి ప్రభుత్వానికి పట్టం గట్టారు. ఉద్యోగాల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో? తాము చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం సాధించాలనే తపనతో యువత ఉన్నారు. అప్పుడే పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా ఫీజులు కట్టి శిక్షణ పొందుతున్న పరిస్థితి. ఉద్యోగాల నోటిఫికేషన్ వచ్చే వరకూ కనీసం ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతి అయినా అందిస్తుందనే ఆశతో నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ హామీ మేరకు పెనమలూరు నియోజకవర్గంలో ఉన్న 98,489 మంది, గన్నవరంలో 97,837 మంది గృహాల్లో నిరుద్యోగ భృతి దక్కనున్నట్లు అంచనా.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి..



సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి చెల్లించాలి. ప్రభుత్వం వచ్చి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదు. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి.

– గురిందపల్లి అశోక్, నిడమానూరు

ఎన్నికల వాగ్దానం అమలు చేయాలి..



నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాను. టీడీపీ కూటమి అధికారంలోకి రావటంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తుందని ఎదురుచూస్తున్నాం. అంతేకాక నిరుద్యోగులకు భృతి కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేసి ఆదుకోవాలి.

– పిల్లి భాస్కర్, బొమ్ములూరు, బాపులపాడు మండలం

నిరుద్యోగ భృతి చెల్లించాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి చెల్లిస్తామని ప్రకటించింది. ఈ మేరకు నిరుద్యోగ భృతి చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలి. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి.

-బి.సురేంద్రరెడ్డి, నున్న

త్వరగా అమలు చేయాలి..



టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం నిరుద్యోగులైన తనవంటి వారికి ఉద్యోగాల కల్పన దిశగా దృష్టి పెట్టాలి. దీని వల్ల కుటుంబానికి అసరాగా నిలవడంతో పాటు భవిష్యత్‌కు భరోసా దొరుకుతుంది. నూతన ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలని కోరుకుంటున్నాం.

– వల్లూరి చక్రవర్తి, గన్నవరం

అర్హులందరికీ భృతి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీల్లో ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి ఉంది. నిరుద్యోగ యువత హామీ అమలు కోసం ఆశగా చూస్తున్నారు. ప్రతి ఇల్లూ ఈ హామీ కింద లబ్ధి పొందుతుంది. అనేక మంది యువత ఉద్యోగాల కోసం చూస్తున్నారు. ప్రభుత్వం అర్హులందరికీ వర్తింపచేసి, కుటుంబాలకు బాసటగా నిలవాలి.

– భీమవరపు నరేష్‌రెడ్డి, కుందేరు, కంకిపాడు మండలం

భృతితో ఆర్థిక దన్ను..



బీఎస్సీ మ్యాథ్స్ పూర్తిచేశాను. ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. ప్రభుత్వం ఉద్యోగ కల్పన, అప్పటి వరకూ నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించింది. ఆ హామీ అమలు కోసం ఆశగా ఎదురుచూస్తున్నాం. ఉద్యోగం సాధించే వరకూ భృతి కుటుంబానికి ఆర్థిక దన్నుగా ఉపకరిస్తుంది. – పఠాన్ జులైఖా, కానూరు

క్లుప్తంగా

19న తిరుపతమ్మకు శాకంబరీ అలంకరణ

పెనమలూరు: కానూరు గ్రామంలో వేంచేసి ఉన్న గోపయ్య సమేత శ్రీతిరుపతమ్మ తల్లి దేవస్థానంలో ఈ నెల 19వ తేదీన అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు సోమవారం కమిటీ సభ్యులు వివరాలు తెలుపుతూ 19వ తేదీ ఉదయం 8.45 గంటలకు అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. 20 రకాల కూరగాయలతో అమ్మవారి అలంకరణ చేస్తామని తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగ వెంకట దుర్గవిశ్వనాథ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొనే భక్తులు ఈ నెల 17వ తేదీలోగా ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన వారాహి మాత నవరాత్రి మహోత్సవాలు



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వరసిద్ధి ప్రధాయిని శ్రీవారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుహాసినీలచే శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్రం, శ్రీలక్ష్మీ అష్టోత్రం జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. వారాహి నవరాత్రులను విజయవంతం చేసిన తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులు, భక్తులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. పలువురు గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి గ్రామంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. మంగళవారం మహాలక్ష్మినగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. దీని కారణంగా బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మినగర్, వసంతనగర్, విష్ణుపురం కాలనీ, సాయినగర్, బందరు రోడ్డు, లక్ష్మిపురంకాలనీ, రంగా బొమ్మ, బ్రహ్మంగారి గుడి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ సిబ్బందికి స్థానికులు సహకరించాలని కోరారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామ లింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు సహకారంతో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రథ ఫెస్ట్‌లో ఉయ్యూరు విద్యార్థుల ప్రతిభ



ఉయ్యూరు: ఇస్కాన్ సంస్థ ప్రతి ఏటా నిర్వహించే రథయాత్రలో ఉయ్యూరు విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. ప్రస్టేజియస్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ రథ ఫెస్ట్ ఈనెల 14న జరిగింది. ఈ ఫెస్టివల్‌లో ఉయ్యూరుకు చెందిన ఏనుగుదాటి ధాన్యసహేమ కీబోర్డు సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని, జూనియర్స్ విభాగంలో కానూరుకు కోలా సూర్య ప్రథమ స్థానాన్ని, సీనియర్స్ విభాగంలో ఉయ్యూరుకు చెందిన నారేపాలెం సాయి రాఘవ ద్వితీయ స్థానాన్ని, గ్రూప్ విభాగంలో ధూళిపూడి భవన్‌క్రాంత్, లక్ష్మీశెట్టి లాస్యప్రియ, కోలా సూర్య, నారేపాలెం సాయి రాఘవ ప్రథమ స్థానాన్ని సాధించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ధూళిపూడి శేషగిరిరావును ఉయ్యూరు ఏజీఅండ్ ఎస్‌జి సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ జీజేపీ వినయ్‌కుమార్, కంకిపాటి లక్ష్మీనారాయణ మెమోరియల్ త్యాగరాజ నాయీబ్రాహ్మణ సంగీత సమితి కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు కంకిపాటి కాళహస్తి అభినందించారు.

దళితులపై దౌర్జన్యాలను అరికట్టాలి

కంకిపాడు: దళితులపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నప ఏరూరు గ్రామంలో కదిరి ప్రభాకర్ అనే దళితుడిపై ఈనెల 12న వేడి నూనె పోసి దాడి చేయటం అమానుషమన్నారు. దోషులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. దాడికి కారణమైన దుకాణదారుడు గజ్జల వెంకట సుబ్బారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై పెరుగుతున్న దాడులను నిరోధించాలని, దళితులకు భద్రత కల్పించాలని కోరారు.

జలమయమైన అంతర్గత రహదారులు

రామవరప్పాడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి విజయవాడ రూరల్ మండలం పలు గ్రామాల్లోని అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ప్రధాన రహదారులపైకి వర్షపునీరు చేరుకుంది. పలు గ్రామాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి రహదారిపై భారీగా వర్షపునీరు వచ్చింది. రామవరప్పాడు కొట్టివారి వీధి, బల్లెంవారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో భారీగా వర్షం నీరు నిలిచింది. పలు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లు పొంగి పొర్లాయి. ప్రసాదంపాడు వాటర్‌ట్యాంక్ ఏరియా, ఎస్సీ కాలనీ, కాల్వగట్టు ప్రాంతం, కానూరు వెళ్ల డొంక రోడ్డు చిత్తడిగా మారాయి. కానూరు వెళ్ల డొంక రోడ్డు అధ్వానంగా మారడంతో గోతుల్లో వర్షపునీరు నిలవడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎనికేపాడు జెండా చెట్టు సెంటర్, శివాలయం పల్లాలు, రైల్వేకట్ట, విజయా ఆగ్రో కట్టపై బురదమయంగా మారింది. నిడమానూరు నెహ్రూనగర్, రామానగర్, కాల్వగట్టు ప్రాంతంలో వర్షపునీరు చేరుకుంది. గూడవల్లిలో పలు అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో ఆయా గ్రామాల్లోని అధికారులు నీరు నిలిచిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు అవలంభిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక ఎస్‌ఎం కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలానికి చెందిన ప్రజలు నివేశన స్థలాలు, రేషన్‌కార్డులు, తాగు, సాగునీరు, భూసమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించేందుకు అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ నేతృత్వంలో పరిష్కార వేదిక నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రజల నుంచి అర్జీల స్వీకరణకు ప్రత్యేకంగా 16 కౌంటర్లను ఏర్పాటు చేశారు. గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి, మాజీ ఎమ్మెల్యేలు దాసరి వెంకటబాలవర్ధనరావు, మూల్పూరు బాలకృష్ణారావు, డీఎస్పీ జయసూర్య, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.వెంకటలక్ష్మి, తహసీల్దార్ పవన్‌కుమార్, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, బుద్దవరం సర్పంచి బడుగు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎసైన్‌మెంట్ భూమిని ఆన్‌లైన్ చేయాలి

ఉంగుటూరు: ఎసైన్‌మెంట్ భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ ఎలుకపాడు గ్రామస్తులు గన్నవరంలో సోమవారం జరిగిన మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1979వ సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎస్‌నంబర్ 31/20లో 50 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికీ 10 సెంట్ల చొప్పున డీ పామ్‌పట్టాతో భూమిని అందజేసిందన్నారు. సదరు భూమిని ప్రభుత్వం ఆన్‌లైన్ చేయాలని వారు కోరారు.

ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు టీవీ లక్ష్మణస్వామి, పి.రాజారావు, ఏసుదాసు, ఆంజనేయులు, గ్రామస్తులు అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెంకట్రావు, ఆర్డీఓ పద్మావతి

కె.ఎల్.రావు స్మారక కేంద్రం ఏర్పాటుచేయాలి



కంకిపాడు: బహుముఖ ప్రజ్ఞాశాలి, కంకిపాడు వాసి, డాక్టర్ కానూరు లక్ష్మణరావు(కె.ఎల్.రావు) జ్ఞాపకార్థం కంకిపాడులో స్మారక కేంద్రం ఏర్పాటుచేయాలని డాక్టర్ కె.ఎల్.రావు విజ్ఞాన వేదిక కన్వీనర్ సుబ్బారావు కోరారు. కె.ఎల్.రావు జయంతి కార్యక్రమం కంకిపాడులో సోమవారం నిర్వహించారు. పలువురు ప్రతినిధులు కె.ఎల్.రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంకిపాడులో పుట్టి పెరిగి, ఖండాంతరాల్లో భారత ఖ్యాతిని ఇనుమడింప చేసిన కె.ఎల్.రావును అందరూ స్మరించుకోవాలన్నారు. కె.ఎల్.రావు స్మారక కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పి.రంగారావు, కె.నాంచారయ్య, తాడంకి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో బెంబేలు

విజయవాడరూరల్: నున్న గ్రామీణ(పాయకాపురం) పోలీస్ స్టేషన్ పరిధి పాతపాడు గ్రామ శివారు సీతారామపురం గ్రామస్తులు వరుస చోరీలతో బెంబేలెత్తుతున్నారు. ముందెన్నడూ లేని విధంగా దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల గ్రామంలో అవుతు అజయ్‌రెడ్డి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు లక్షల 20 వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన జరిగిన రెండో రోజు ఉపాధి పనికి పోలవరం కట్ట మీద ఉదయం 8 గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న పామర్తి లక్ష్మి(50) అనే మహిళ మెడలో బంగారు నానతాడు తెంచుకొని పారిపోతుండగా ఆ మహిళ దొంగ చేతిని పట్టుకొని వెంటపడగా బ్లేడుతో చేతిని గాయపర్చి నానతాడుతో పరారయ్యాడు. ఈ సంఘటనలతో గ్రామస్తులు భయపడుతున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్తులు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో గస్తీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చినకంచి వద్ద వాగుపై వంతెన నిర్మించాలి

విజయవాడరూరల్: నున్న గ్రామంలో వికాస్ కాలేజీకి వెళ్లే రోడ్డులో చినకంచి వద్ద వాగు పై వంతెన నిర్మించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దండు సుబ్రహ్మణ్యం రాజు కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దరఖాస్తును ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావుకు అందజేశారు. వంతెన నిర్మించడంతో గ్రామంలోని రైతాంగానికి, వికాస్ కాలేజీకి వెళ్లే అధ్యాపకులు, విద్యార్థులు, సమీప గ్రామాల ప్రజలతో పాటు గత ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలో 4,213 కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అదే విధంగా నిడమానూరు గ్రామం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఎదురు రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వ సదుపాయం లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన మాదల రామకృష్ణ అధికారులకు దరఖాస్తు అందజేశారు. రోడ్డును మెరక చేసి డ్రెయినేజీ కాల్వ నిర్మించాలని ఆయన దరఖాస్తులో పేర్కొన్నారు.



ప్రజావేదికలో అర్జీ అందజేస్తున్న సుబ్రహ్మణ్యం రాజు

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి

పెనమలూరు: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో తన కార్యాలయంలో సోమవారం పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తాగునీరు కొరత లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీల్లో ఇంటి పన్నులు సక్రమంగా వసూళ్లు చేయాలన్నారు. పంచాయతీలో పన్నులు రివిజన్ చేసి నిధులు సమకూర్చుకోవాలని సూచించారు.

యనమలకుదురులో బోరు ప్రారంభం

తాడిగడప మున్సిపాలిటీ యనమలకుదురు ఇందిరానగర్ వన్‌లో రూ.4.32 లక్షలతో ఏర్పాటు చేసిన నీటి బోరును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. కాలువ కట్ట ప్రాంతంలో తాగునీరు సమస్య రావటంతో మున్సిపాలిటీ నిధులతో కొత్తగా బోరు వేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పోరంకిలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రసాద్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం ఓగిరాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలోని రెండు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని 82 మంది విద్యార్థులకు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు మేడికొండ బుచ్చిబాపయ్య సహకారంతో ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామంలో పేద విద్యార్థులకు, విద్యాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మేడికొండ బుచ్చిబాపయ్య చెప్పారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, గూడపాటి రత్నశేఖర్, మాకినేని శ్రీనివాసరావు, గ్రామ ప్రముఖుడు కగ్గా డేవిడ్ పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న దాత బుచ్చిబాపయ్య, లయన్స్ క్లబ్ సభ్యులు

పెనమలూరులో ఇద్దరిపై దాడి

పెనమలూరు: పెనమలూరులో ఇద్దరు వ్యక్తులపై పలువురు దాడి చేయటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరుకు చెందిన షేక్ సుభాన్‌వలి డిగ్రీ చదువుతున్నాడు. ఈ నెల 14వ తేదీన శనివారం పీర్ల పండుగ సందర్భంగా గ్రామంలో జెండా చెట్టు వద్ద ఉండగా అజారుద్దీన్ అనే వ్యక్తి మద్యం సేవించి వచ్చి గొడవ పడ్డాడు. కాగా ఆదివారం సుభాన్‌వలి, అతని మిత్రుడు చింతా జశ్వంత్ బైక్‌పై చోడవరం వైపునకు వెళ్తుండగా అజారుద్దీన్, నాసూర్‌బాబు, సుభాని మరో బైక్‌పై వచ్చి అటకాయించి షేక్.సుభాన్‌వలి, చింతా జశ్వంత్‌లపై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

18, 19 తేదీల్లో వీఆర్‌లో అంతర్జాతీయ సదస్సు

పెనమలూరు: కానూరు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ వీఆర్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈ నెల 18, 19వ తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్ తెలిపారు. ఆయన కానూరు క్యాంపస్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ విభాగం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్(ఐఈఈఈ) సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. గ్రీన్ అండ్ సస్టైనబుల్ టెక్నాలజీస్ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌పై సదస్సు జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో సోలార్, విండ్ ఎనర్జీ ప్రాధాన్యతను సదస్సుకు వచ్చే నిపుణులు వివరిస్తారన్నారు. అంతర్జాతీయ సదస్సు కోసం 602 టెక్నికల్ పేపర్స్ అందాయని వాటిలో 143 టెక్నికల్ పేపర్లు ఆమోదించామని, వీటిపై సదస్సులో చర్చిస్తామని చెప్పారు. అంతర్జాతీయ సదస్సుకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ ఇస్రో డైరెక్టర్ ఎ.రాజరాజన్ ప్రారంభించి ప్రసంగిస్తారన్నారు. ఈ సదస్సులో మలేషియా, జపాన్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, చైనా నుంచి ప్రఖ్యాత నిపుణులు పాల్గొని వారి విలువైన సూచనలు, సలహాలు అందజేస్తారని చెప్పారు. సమావేశంలో వివిధ విభాగాధిపతులు చావా శ్రీనివాస్, డి.వెంకట్రావు, రమాదేవి, ఎంవీఎస్.రాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.



కానూరులో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఉపకులపతి రత్నప్రసాద్, ప్రొఫెసర్లు

కానూరులో కార్మల్ మాత తేరు ఊరేగింపు



పెనమలూరు: కానూరు కార్మిల్ మాత పుణ్య క్షేత్ర మహోత్సవాల్లో భాగంగా సోమవారం కార్మిల్ మాత తేరు ప్రదక్షిణల కార్యక్రమాన్ని ఫాదర్ సలివేంద్రశౌరి ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీ నుంచి కార్మిల్‌మాత నవదిన ప్రార్థనలు జరుగుతున్నాయి. చివరి రోజైన సోమవారం కార్మిల్ మాతను కామయ్య తోపు సెంటర్‌లో ఊరేగించారు. భక్తులు జపమాలతో ప్రార్థనలతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం కార్మిల్‌మాత పుణ్యక్షేత్రంలో ప్రధాన అర్చకులు ఫాదర్ తాళ్లూరి ఆనంద్ దివ్యబలి పూజ నిర్వహించారు. భక్తులకు దివ్య ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్లు దేవదానం, రత్నరాజు, సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, కౌన్సిల్ సభ్యులు, దళ సభ్యులు, యూనిట్ సభ్యులు, పోరంకి,సాలిపేట, కానూరుకు చెందిన భక్తులు పాల్గొన్నారు.